వలంటీర్ల వ్యవస్థతో పారదర్శక పాలన

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్నారు. వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్నారు. ప్రజలకు సంక్షేమ ఫలాలను చేరవేస్తున్నారు. సీఎం జగనన్న ప్రభుత్వం వలంటీర్, సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ పరంగా ఏదైనా పని కావాలంటే ఉపాధి వదులుకుని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే ఇబ్బందులు తప్పాయని, ఇంటికే పాలన చేరువ చేశారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వలంటీర్లకు వందనం


ఏలూరులోని వార్డు సచివాలయం (ఫైల్)

ఉత్తమ సేవలు



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచీ పేదలకు మంచి జరుగుతోంది. ఏదైనా ప్రభుత్వ పథకం కావాలంటే అధికారులు, ఆఫీసుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఇంటి వద్దకే అన్నీ అందుతున్నాయి. సంక్షేమ పథకాల లబ్ధి కూడా నేరుగా మా బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయిస్తున్నారు. అవినీతికి పాల్పడే అవకాశమే లేదు. నాకు వాహనమిత్ర డబ్బులు వేస్తున్నారు. మా వలంటీర్ వైష్ణవనాథ్ అందరికీ మంచి సేవలు అందిస్తున్నాడు.

– తానంకి చంద్రశేఖర్, ఏలూరు వన్‌టౌన్

మంచి చేయటం తప్పా?



టీడీపీ హయాంలో పేదలకు ఇచ్చింది ఏమీ లేదు. ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నాకు కాపు నేస్తం డబ్బులు వస్తున్నాయి. రెండేళ్లుగా కాపు నేస్తం సొమ్ము వేస్తున్నారు. మూడో ఏడాది కూడా రావటానికి వలంటీర్ హర్షిత లక్ష్మి దరఖాస్తు ఆన్‌లైన్ చేశారు. ప్రజలకు మేలు చేయటం కూడా తప్పని విమర్శిస్తే ఏమి చేస్తాం. ప్రజలకు ఏది మంచిదో జగనన్నకు తెలుసు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందించే పథకాలు ఇంటికే వస్తున్నాయి.

– కోడూరి బుల్లిరాణి , వైఎస్సార్ కాలనీ, 13వ డివిజన్

వలంటీర్ వ్యవస్థ భేష్



ప్రజలకు సంక్షేమ పథకాలు, ఇతర సేవలు నేరుగా ఇంటి వద్దకే అందిస్తోన్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఆయన చేపట్టిన వలంటీర్ వ్యవస్థ ద్వారా మా ప్రాంతంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. మా వలంటీర్ రాజ్యలక్ష్మి కుటుంబంలోని వ్యక్తిలా ఉంటూ అందరికీ మంచి సేవలు అందిస్తోంది. డ్వాక్రా రుణమాఫీ కూడా చేయించింది. మాకు ఇంటి స్థలం వచ్చింది. ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇస్తుంది.

– కొయ్య రాజేశ్వరి, ఏఎఎస్ కాలనీ, ఏలూరు

జగనన్న ప్రభుత్వం బెస్ట్



జగనన్న ప్రభుత్వం మంచి పరిపాలన చేస్తోంది. ప్రజల ఇంటివద్దకే సేవలు అందించేందుకు వలంటీర్ వ్యవస్థను అమల్లోకి తెచ్చారు. నాకు ఇంటిస్థలం వచ్చింది, అమ్మఒడి పథకం డబ్బులు వేస్తున్నారు. ఇవన్నీ మా కుటుంబాలకు అండగా ఉంటున్నాయి. టీడీపీ హయాంలో లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసినా ప్రజలకు రూపాయి కూడా ఇవ్వలేదు. ఇప్పుడు వలంటీర్ల ద్వారా అన్ని ప్రజలకు అందేలా చేస్తున్నారు. వలంటీర్ వ్యవస్థను తప్పు బట్టేందుకు అవకాశం లేదు.

– యల్లాపు ఝాన్సి, కొత్తగూడెం, ఏలూరు

రైస్ పుల్లింగ్ పేరుతో మోసం

ఏలూరు టౌన్: రైస్ పుల్లింగ్ యంత్రం ఇస్తామని చెప్పి నమ్మబలికి ఓ వ్యాపారి నుంచి ఇద్దరు వ్యక్తులు రూ.70 లక్షలు కాజేశారు. వివరాలిలా ఉన్నాయి. ఏలూరు ఎన్‌ఆర్‌పేటలో ఫైనాన్స్ వ్యాపారి పులవర్తి సుజన్‌కుమార్ వద్దకు ఆరు నెలల క్రితం హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు వచ్చి తమ వద్ద రైస్ పుల్లింగ్ యంత్రం ఉందని, యంత్రం ఖరీదు రూ.5 కోట్లు ఉంటుందని, రూ.1 కోటికి ఇస్తామని నమ్మబలికారు. వారు చెప్పేది నిజమని నమ్మిన సుజన్‌కుమార్ రూ.50 లక్షలను కొప్పుల గోపి, సాయి అనే ఇద్దరి బ్యాంక్ ఖాతాలకు జమ చేశాడు. మరో రూ.20 లక్షలు నగదు ఇచ్చాడు. ఎంతకాలమైన యంత్రం రాకపోవడంతో మోసం చేశారని గ్రహించి శనివారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సదస్సు పోస్టర్ విడుదల

ఏలూరు (టూటౌన్): రైతాంగ సమస్యలపై ఈనెల 30న నిర్వహించే కార్మిక, కర్షక రాష్ట్ర సదస్సు ప్రచార పోస్టర్‌ను శనివారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నాయకులు విడుదల చేశారు. విజయవాడలోని సిద్ధార్థ కాలేజీ ఆడిటోరియంలో నిర్వహించే రాష్ట్ర సదస్సుకు జిల్లాలోని రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులంతా పాల్గొనాలని కోరారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఒత్తిడి తీసుకు రావాలని కోరారు.

క్లుప్తంగా

పంచగవ్యంతో భూమి సారవంతం


సేవ్ సాయిల్‌పై కలెక్టర్‌కు వివరిస్తున్న సైక్లిస్ట్ మోహిత్

ఏలూరు(మెట్రో): భూమి సారవంతానికి పంచగవ్యం వంటి ఉత్తమ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. 2050 నాటికి భూమిలోని 90 శాతం మట్టి క్షీణించి పోతుందని ఐక్యరాజ్యసమితి చెబుతున్న దృష్ట్యా ఈశా ఫౌండేషన్ సద్గురు జగ్గీవాసుదేవ్ మట్టిలో సేంద్రియ పదార్థాలను కనీసం మూడు శాతం వరకు పెంచేందుకు సేవ్ సాయిల్ ప్రారంభించిన ఉద్యమానికి అనుగుణంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు మోహిత్ ఉత్తరప్రదేశ్ లలిత్‌పూర్ నుంచి చేపట్టిన భారతదేశ సైకిల్ యాత్ర శనివారం ఏలూరు చేరింది. సైక్లిస్ట్ మోహిత్ స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తన యాత్ర ఉద్దేశాన్ని వివరించారు. అతని ప్రయత్నాలను కలెక్టర్ మెచ్చుకున్నారు. నేల ఆరోగ్యంపై సామాన్యులకు వివరించే పద్ధతులను సూచించారు.

కోమటిలంకలో 100 సేవలు


లబ్ధిదారులకు ధ్రువ పత్రం అందిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్: కొల్లేరు నడిబొడ్డు గ్రామం కోమటిలంకలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ తెనాలి యోహాన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వై.సుజాత, ఈఓపీఆర్డీ ఎం.సరళకుమారి పాల్గొన్నారు. తొలుత పరిసర ఖాళీస్థలాల్లో ప్రజలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా 100 మందికి పైగా దరఖాస్తుదారులకు వివిధ ధ్రువ పత్రాలను అందజేశారు. వడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ మండల కొండలరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ సేవలు అందుకోవాలంటే కొల్లేరు ప్రజలు నానా అగచాట్లు పడేవారని గుర్తు చేశారు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన తెచ్చిందన్నారు. సర్పంచ్ యోహాన్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామంలో కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎం.రత్నం, కలకుర్రు సర్పంచ్ బలే నాగప్రసాద్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

ఏలూరు టౌన్ : స్థానిక పవర్‌పేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ నెంబర్ 1 చివర గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 60 ఏళ్ల వయసు గల వ్యక్తి సహజ మరణం పొందినట్టు రైల్వే పోలీసులు భావిస్తున్నారు. ఏలూరు రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ఎస్.ఆదినారాయణ కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుని ఎత్తు 5.5 చామన ఛాయ రంగులో ఉన్నాడు. మృతుడు నీలం రంగు పొట్టి చేతుల టీషర్ట్, ఆకుపచ్చ రంగు లోయర్ ధరించి ఉన్నాడు. మృతుని వద్ద రామచంద్రరావు క్లినిక్, బోసు శిబిరం రోడ్డు, ఏలూరు అనే పేరుతో మందుల చీటీ, కొన్ని మందులు, ముక్కుపొడుం రంగు పారగాన్ హవాయ్ చెప్పులు, చేతికర్ర ఉన్నాయని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. వివరాలకు రైల్వే హెచ్‌సీ ఆదినారాయణ సెల్ నెంబర్ 80740 55378కు సంప్రదించాలని కోరారు.

మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా ధర్నా

ఏలూరు (టూటౌన్): మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో శనివారం స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి, నాయకురాలు జె.హరీషా దుర్గ మాట్లాడుతూ మణిపూర్‌లో మతోన్మాద అల్లరి మూకలు ముగ్గురు మహిళలను నగ్నంగా ఊరేగించడాన్ని ఖండించారు. గత 78 రోజులుగా కొనసాగుతున్న మణిపూర్ అల్లర్లను బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకుండా వ్యవహరించిందని దుయ్యబట్టారు. దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఆ రాష్ట్రంలో జరిగిన అకృత్యాలను బయట సమాజానికి తెలియనీయకుండా ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్నెట్ పై నిషేధం విధించిందన్నారు. ఇంటర్నెట్ సేవలపై అక్కడి ప్రజలు కోర్టుకు వెళ్లిన తర్వాత తిరిగి పునరుద్ధరించారని చెప్పారు. ఈ ఘటన జరిగి మూడు నెలలు కావస్తుంటే ప్రధానమంత్రి ఇప్పుడు సిగ్గుపడుతున్నామని చెప్పటం నిజంగా మహిళలుగా సిగ్గుపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు గాళ్ల శారద, బి.జయలక్ష్మి, టి.రజని, టి.సుకన్య, సీఐటీయూ నాయకులు పి.కిషోర్, ఎం.శ్రీనివాసరావు, బి.జగన్నాథరావు, జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.


మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న ఐద్వా మహిళా నాయకులు

సైనికుడి భార్యపైనా అత్యాచారం

దేశ సరిహద్దుల్లో పహారా కాస్తూ తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి మనకు స్వేచ్ఛా జీవితాలను అందిస్తున్న సైనికుడి భార్యపైనా అత్యాచారం చేసి హత్య చేయడం దురదృష్టకరమని జాతీయ ఎస్సీ నాయకులు పొలిమేర హరికృష్ణ అన్నారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన చర్మకారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మణిపూర్‌లో అత్యాచారాలు, హత్యలు చేసి పాలకులు శవాలను పాలిస్తారా అని ప్రశ్నించారు. ప్రసార మాధ్యమాల ప్రత్యేక కథనాలను పరిగణలోకి తీసుకుని దుండగులను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర నాయకులు పాకా ప్రభాకర రావు, జిల్లా చర్మకారుల సంఘం నాయకులు బేవనపల్లి లక్ష్మణరావు, చింతాటి వెంకన్న, వేల్పుల జయరాజు, బడిపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


చర్మకారుల సమావేశంలో మాట్లాడుతున్న హరికృష్ణ

రెడ్డి కార్పొరేషన్ ద్వారా రుణాలివ్వాలి

ఏలూరు టౌన్: రెడ్డి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేసి రెడ్ల అభ్యున్నతికి పాటుపడాలని ఏపీ రాష్ట్ర రెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంగులకుంట నరేష్ కుమార్ రెడ్డి కోరారు. ఏలూరు జిల్లా పర్యటనలో భాగంగా ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏలూరు జిల్లాలోని రెడ్ల జీవన స్థితిగతులను తెలుసుకోవటంతోపాటు, రెడ్డి సంఘం బలోపేతానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో కమిటీలు వేయనున్నట్టు ఆయన చెప్పారు. ఏపీ రాష్ట్రంలో సుమారు 60 లక్షలకు పైగా రెడ్డి సామాజికవర్గం జనాభా ఉన్నారని, వీరిలో 70 శాతం మంది పేద, మధ్య తరగతి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వారి స్వయం ఉపాధికి రెడ్డి కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుపతి, శ్రీశైలం, కాణిపాకం, ద్వారకాతిరుమల, అన్నవరం, సింహాచలం, ఒంటిమిట్ట వంటి ప్రాంతాల్లో రెడ్డి వసతిగృహాలు నిర్మించుకునేందుకు స్థలాలు కేటాయించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గట్టిరెడ్డి భయపరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని గోపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి, వెంగళరెడ్డి, రఘునాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

క్షేత్రస్థాయి అధ్యయనంతో సమర్థవంత పాలన

ఏలూరు(మెట్రో): క్షేత్రస్థాయి అధ్యయనంతో సమర్థవంతమైన పాలన అందించడం సాధ్యమవుతుందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయిలో వివిధ పథకాలు, కార్యక్రమాల అమలు తీరు పరిశీలనకు జిల్లాకు విచ్చేసిన ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం సభ్యులు బి.సామ్రాన్‌రాజ్, బి.సహదిత్ వెంకట త్రివినాగ్, సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, కేఆర్ కల్పశ్రీ, కుషాల్‌జైన్, యం.మౌర్య భరద్వాజ్, రాఘవేంద్ర మీనా, సౌర్యమాన్ పటేల్, తిరుమణి శ్రీపూజ, వి.సంజనసింహ స్థానిక కలెక్టర్ బంగ్లాలో జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి పర్యటనలు, గ్రామీణ స్థితిగతుల అధ్యయనంతో పూర్తిస్థాయి సేవలు అందించగలుగుతారని చెప్పారు. రెవెన్యూ అంశాలు, భూ రికార్డులు, పరిపాలన తదితర అంశాలను క్లుప్తంగా వారికి వివరించారు. అనంతరం ట్రైనీ ఐఎఎస్ అధికారుల బృందం పోలవరం ప్రాజెక్ట్ సందర్శనకు బయలుదేరి వెళ్లింది.


కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో మాట్లాడుతున్న ట్రైనీ ఐఏఎస్ అధికారులు

మత్స్యశాఖ ద్వారా యువతకు ఉపాధి

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మత్స్యశాఖ అధికారులు ఫిష్ ఆంధ్ర కార్యక్రమం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. శనివారం ఏలూరు జిల్లా మత్స్యశాఖ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు ఫిష్ ఆంధ్ర వాహనం అందజేశారు. కరోనా కష్టకాలంలో ఎగుమతులు నిలిచిపోయి నష్టాల పాలయిన ఆక్వా రంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని విధాలుగా ఆదుకున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వమే నేరుగా చేపలు, రొయ్యలు కొనుగోలు చేసి ఎగుమతి చేసిందని కొనియాడారు. నాలుగేళ్లుగా సాగుదారులకు సబ్సిడీపై విద్యుత్ అందించి ఆక్వా రంగానికి కొత్త ఊపు తెచ్చారని తెలిపారు. ఆక్వా ఉత్పత్తులకు దేశీయంగా గిరాకీ పెంచేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని వివరించారు. ఏలూరు డివిజన్ ఏడీ బి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఫిష్ ఆంధ్ర ద్వారా ఎస్సీలకు 60 శాతం, బీసీ, ఓసీలకు 40 శాతం సబ్సిడీపై రూ.3 లక్షల ఖరీదు గల వాహనం అందిస్తున్నామని చెప్పారు. ఫిష్ ఆంధ్ర వల్ల యువతకు ఉపాధి కలగడంతో పాటు ప్రజలకు ఆక్వా రైతు ఉత్పత్తులు మరింత చేరుతాయన్నారు. జిల్లాకు 30 యూనిట్లు మంజూరయ్యాయని, ఆసక్తి గల యువత తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు ఎఫ్‌డీఓ జె.దివ్య తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారుడికి వాహనం అందిస్తున్న దృశ్యం

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): జిల్లాలో అర్హత గల 9, 10, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు చదువుతోన్న బీసీ, ఈబీసీ, సంచార జాతుల కులాల విద్యార్థులు పీఎం యశస్వి ఉపకార వేతనాలు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి ఆర్ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలకు మించరాదని పేర్కొన్నారు. అభ్యర్థులకు నేషనల్ టెస్ట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 29న ఎంపిక పరీక్ష ఉంటుందని, పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


రైలు ఢీకొని మృతిచెందిన వ్యక్తి

ఏలూరు టౌన్: ఏలూరు పెద్దరైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్–2పై రైలు పట్టాల వైపు ఒక వ్యక్తి నీటితో ముఖం కడుగుకుంటూ ఉండగా గూడ్స్ రైలు ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. ఆ వ్యక్తి ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. గుర్తు తెలియని వ్యక్తి (35) ముఖం కడుక్కుంటూ ఉండగా గూడ్స్ రైలు రావటాన్ని గమనించకపోవటంతో ఢీకొంది. తలకు తీవ్ర గాయాలయిన అతడ్ని ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. మృతుడు సుమారు 5.6 ఎత్తు, కోల ముఖం, చామన ఛాయ, నలుపు జుట్టు కలిగి ఉన్నాడు. నీలం రంగు జీన్స్ ప్యాంట్, నలుపు రంగు పొడవు చేతుల చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఏలూరు రైల్వే ఎస్సై నరసింహారావు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు సెల్ నెంబర్ 95020 97672లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

విద్యారంగ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యారంగ అభివృద్ధిలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని ఏలూరు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ కోరారు. జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ఆయనను స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నట్టు చెప్పారు. వీటిని అర్హులకు అందజేయడానికి ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ జీజేఏ స్టీవెన్ మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఎంతోమంది పేదలు నేడు ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డారని వివరించారు. తండ్రి అడుగుజాడల్లోనే జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తూ మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ పెదపాడు మండల అధ్యక్షుడు కాటి వెంకట రమణ, అత్తిలి గ్రామ సర్పంచ్ గంటా విజేత నాగరాజు, సీనియర్ ఉపాధ్యాయుడు తోట ప్రసాద్ తదితరులున్నారు.


శ్యామ్ సుందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అశోక్ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వార్షిక మరమ్మతుల నిమిత్తం ఆదివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.శశిధర్ పేర్కొన్నారు. ఆర్‌పీ రామారావు వీధి, డాక్టర్ సత్యనారాయణ వీధి, పోలీస్ క్వార్టర్స్, కొత్త బస్టాండు ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఏలూరు టౌన్: స్థానిక చిట్టివలసపాకలు ప్రాంతంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుమారు 60 నుంచి 65 ఏళ్ల వయస్సు గల వృద్ధుడు గుర్తు తెలియని రైలు బండి నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు ఎత్తు సుమారుగా 5.5, తెల్లని జుట్టు, గెడ్డం కలిగి ఉన్నాడు. మృతుడు ఒంటిపై లేత నీలం రంగు పూలషర్ట్, ఆకుపచ్చ రంగు నిలువ చారల లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు ఏలూరు రైల్వే ఎస్సై డి.నరసింహారావు సెల్ నెంబర్ 95020 97672కు తెలియజేయాలని ఎస్సై కోరారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని చెప్పారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	21
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	18
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	12
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	03
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	02
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	05
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	10
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	09
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు –తిరుపతి	16.00	4830	33